క్లుప్తంగా

జగిత్యాల ఎమ్మెల్యేకు సన్మానం



పూల మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్: జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరు సంజయ్ కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులతో రామప్ప పర్యటనకు వెళ్తున్న క్రమంలో మంజూరునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు శాలువా కప్పి సన్మానించి పూల మొక్క అందజేశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం: మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన బానోత్ రాజుకుమార్, మంతెన రంజిత్, మండలంలోని పోలారానికి చెందిన పోషమల్లమ్మ, సమ్మయ్య, మూసయ్య, మల్లయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. పుట్ట మధు వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

కాటారం: మండలంలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై–2 శ్రీనివాస్ బాధితులకు ఆదివారం అందజేశారు. కాటారానికి చెందిన ఆనంద్, మల్హర్ మండలం రుద్రారానికి చెందిన రాజబాబు ఇటీవల సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి అప్పగించారు.

డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణ కన్వీనర్ మనీందర్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ పాల్గొని శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు మాచనేని రవీందర్, సామల మధుసూదన్ రెడ్డి, రాంరెడ్డి, కంచం నరసింహమూర్తి, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పంటకు లాభం



రామకిష్టాపూర్(టి) శివారు పొలంలో పెరిగిన జీలుగ



అంకుషాపూర్ శివారు పొలంలో పెరిగిన పెసర

- సేంద్రియ ఎరువులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
- ఆసక్తి చూపుతున్న రైతులు

టేకుమట్ల: భూసారం ఎంత ఉంటే మనం పండించే పంటలు సైతం అంతే ఎక్కువ దిగుబడి వస్తాయి. ఎక్కువ దిగుబడి రావాలనే ఆశతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులను వాడుతున్నారు. తద్వారా నేల నిస్సారంగా మారడంతో పాటు, పెట్టుబడి సైతం పెరిగి రైతుకు భారంగా మారుతోంది. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చిరొట్ట వినియోగాన్ని పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో మండలంలో ఈ సంవత్సరం పచ్చిరొట్టే సాగును అధిక మొత్తంలో చేశారు. పచ్చిరొట్ట, పప్పు విత్తనాలైన జీలుగ, జనుము, పెసరు, మినుములు, ఉలవలు, అలసంద తదితర విత్తనాలను చల్లారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరగాయి. వీటిని దుక్కిలో కలియదున్ని సుమారు 10 రోజుల పాటు మురగనిస్తే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఫలితంగా నేలలో నత్రజని, భాస్వరం, పోటాష్‌ల స్థిరీకరణ జరిగి పంట ఎదుగుదలకు తోడ్పడుతుంది. భూమిని సారవంతం చేయడంతో పాటు, సూక్ష్మజీవులను పెంపొందిస్తూ నేల భౌతిక, రసాయన, జీవలక్షణాలు వృద్ధి చెంది నేలలో నీటిని పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీని వల్ల రసాయన ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా తగ్గించవచ్చు.

పెట్టుబడి తగ్గుతుంది..



పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి, ప్రతీ రైతు సేంద్రియ ఎరువులను వినియోగించాలి. అందుకు ముందుగానే రాయితీలో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ప్రభుత్వాలు తీసుకువస్తున్నాయి. సేంద్రియ ఎరువుల వల్ల పెట్టుబడి తగ్గుతుంది. నేల సారవంతమవుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. కావున ప్రతీ రైతు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంపొందించాలి.

\- కల్యాణి, మండల వ్యవసాయ శాఖ అధికారి

కొన్ని సంవత్సరాలుగా వేస్తున్నా..



నాకున్న రెండెకరాల పొలంలో ప్రతీ సంవత్సరం పచ్చరొట్ట వేస్తున్నా. పూత దశకు చేరుకోగానే పొలంలో కలియదున్ని మురగబెడుతున్నా. దాని వల్ల ఎరువుల వాడకం తగ్గుతోంది. పంట దిగుబడి పెరుగుతోంది. సకాలంలో జీలుగ విత్తనాలను పొలంలో చల్లుతూ పెంచి దున్నుతున్నా.

\- అచ్చె లచ్చన్న, రైతు, రామకిష్టాపూర్(టి)

వెలమ కులస్తులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్: వెలమ కులస్తులు సంఘటితం కావాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నడిపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లాలోని లీలా గార్డెల్‌లో నిర్వహించిన వెలమ సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెలమ సామాజిక వర్గంలో వెనకబడిన వారికి సంఘం ద్వారా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు హనుమకొండ హంటర్ రోడ్డులో సంక్షేమ హాస్టల్ వసతి కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెలమ సంఘం గౌరవ అధ్యక్షుడు జలగం మోహన్‌రావు, కన్వీనర్ వేల్పూరి సత్యనారాయణరావు, లింగంపల్లి పాఆపరావు, గండ్ర గోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, అమృత్‌రావు, శ్రీనివాస్‌రావు, శ్రీదర్‌రావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య



క్రీడాకారులతో సూర్య

మలుగు రూరల్: యువత చదవుతో పాటు క్రీడాల్లో రాణించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారును ఆయన అభినందించి మాట్లాడారు. నిత్యం క్రీడల్లో సాధన చేస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్ రైజస్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, నాయకులు నల్లేల భరత్ కుమార్, రేవంత్, పీఈటీలు శ్రీకాంత్, కోచ్ వంశీ తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ములుగు రూరల్: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 09న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కాశిందేవిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. కార్మికులు పోరాటలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, బండారు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి, సాంబశివ ఉన్నారు.

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న సురేష్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని రాపల్లి కోట, అంబట్‌పల్లి గ్రామాల ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖల కమిటీలను ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అంబట్‌పల్లి గ్రామ శాఖ గౌరవ అధ్యక్షుడిగా రాసపల్లి వెంకటస్వామి, గ్రామ అధ్యక్షుడిలుగా తాళ్లపల్లి చంద్రశేఖర్, రాసపల్లి అశోక్, ప్రధాన కార్యదర్శిగా రాసపల్లి నాగరాజును ఎన్నుకున్నారు. అలాగే రాపల్లికోట గ్రామ శాఖ అధ్యక్షుడిగా గురిజాల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కొయ్యల సంపత్, ప్రధాన కార్యదర్శిగా కొయ్యల సంతోష్, కార్యదర్శిగా గురిజాల సాగర్, కోశాధికారిగా గురిజాల బన్ని, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ యువసేన మండల అధ్యక్షులు రవితేజ, సీనియర్ నాయకులు పత్తి మల్లేష్, గురజాల లచ్చయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ములుగు రూరల్: రాయినిగూడెం నుంచి సర్వాపూర్ వెళ్లేదారి గుంతలమయంగా మారిందని మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలకు వెళ్లేదారి గుంతమయంగా మారి వర్షపు నీరు చేరి అధ్వానంగా ఉందని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో కల్వర్టుల వద్ద కంకర పోసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండమీది వెంకటేశ్వర్లు, కృష్ణ, రమేష్, నర్సయ్య, ప్రశాంత్, రాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీరీలను ఊరేగిస్తున్న ఆచారమంతులు



వరాలు పడుతున్న మహిళలు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఆదివారం నిర్వహించుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా వేడుకలలో పాల్గొన్నారు. ఉదయం నుంచి డప్పుల చప్పుళ్ల మధ్య పీరీలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు బిందెలతో నీళ్లు తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి, పీరీలకు కుడుకలు, రంగుల దట్టీలను ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీరీలను మఖానంలో ఉంచి అగ్ని గుండంలో పాలు పొంగించారు. కోరిన కోరికలు నెరవేరిన భక్తులు మజీదు వద్ద మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి కందూరు నిర్వహించారు. సంతానం కాని మహిళలు వరాలు పట్టారు. పీర్ల చావిడి దగ్గర కొలువుదీరిన పీర్లను సందర్శించిన భక్తులకు బెల్లం పానకాన్ని పంచి పెట్టారు. సాయంత్రం పుర వీధుల్లో పీర్లను ఊరేగించిన అనంతరం గ్రామ శివారులోని బావి వద్ద పీర్లను ఉపసంహరించారు. మండల కేంద్రంలోని జాతరకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జాతర ప్రాంగణామంతా కిక్కిరిసి పోయింది. జాతరలో పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. జాతరలో పులి, కొండెంగ వేశాలు ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేగొండ ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. మొహర్రం వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జాతరలో పులి, కొండెంగ వేషం

రోడ్డుపై గుంతల పూడ్చివేత



మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సీతారామ్‌పురం గ్రామస్తులు ఆదివారం గ్రామంలో రోడ్లపై ఉన్న గుంతలను సొంత ఖర్చులతో పూడ్చారు. గ్రామంలో రోడ్లు అన్ని గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని, మురుగు నీరు నిల్వ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుకు మరమ్మతు చేయించాలని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన వారు పట్టించుకోలేదని వాపోయారు. దీంతో చేసేది ఏమి లేక గ్రామంలోని ప్రతీ ఇంటికి డబ్బులు వసూలు చేసుకోని సొంత ఖర్చులతో మరమ్మతు చేసుకున్నామని తెలిపారు.

ఆషాఢమాస గోరింటాకు సంబురాలు



గోరింటాకుతో మహిళలు

కాటారం: ఆషాఢమాసంను పురస్కరించుకొని మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం బటర్ ఫ్లై కిట్టి పార్టీ మహిళా స్నేహితుల బృందం కలిసి గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనం కల్గుతుందన్నారు. సహజ సిద్ధంగా ఉండే గోరింటాకులోని ఔషధగుణాలు శరీరంలోకి ఇమిడిపోయి మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కుల శ్రీలతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి వేడుకలు



గణపురం: బీరన్న బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కోటగుళ్లలో పూజలు చేస్తున్న భక్తులు

గణపురం: మండలంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బుద్దారం పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. గాంధీనగర్ గ్రామంలో గొల్ల కురుమలు నిర్వహించిన బీరన్న ఉత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలకేంద్రంలోని గణపేశ్వరాలయం,పట్టాభి రామచంద్ర స్వామి ఆలయం, చెల్పూరు సాంబశివ ఆలయంలో ఉదయం నుండే తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్హర్: తొలి ఏకాదశి వేడుకలను మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల తదితర గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు.

కాటారం: తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో దామెరకుంట సమీపంలోని గోదావరి, అన్నారం బ్యారేజ్ సమీపంలో గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. స్థానిక ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం, భకాంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

- మాజీ ఎంపీపీ సమ్మయ్య



క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కాటారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శకాలనీలో ఆదివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. 12 జట్లు పోటీల్లో పాల్గొనగా ఆదర్శకాలనీకి చెందిన ఆత్మకూరి కుమార్, మెరుగు వరుణ్ ప్రథమ స్థానంలో నిలవగా హట్కర్ రమేశ్, మారుపాక రాజేంద్రప్రసాద్ ద్వితియ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పంతకాని సమ్మయ్య విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఓలపు శ్రీనివాస్, పున్నం రమేశ్, నందు, నవీన్, ఉదయ్, వరుణ్, రితిష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మణిదీప్‌రావుకు మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు



మణిదీప్‌కు అవార్డును ఇస్తున్న గవర్నర్

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన డాక్టర్ మణిదీప్‌రావును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సెమినార్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మెడికల్ ఎక్సలెన్స్ అవార్డుతో మణిదీప్‌ను ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకొని మండలానికి పేరు తెచ్చినందుకు గ్రామస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన అన్నం మణికంఠ కొద్ది నెలల క్రితం నిద్రలో బిల్డింగ్ మీదనుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుచేసి వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చాడు. దీంతో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ని ర్వాహకులు నరేష్, రాకేష్ దాతల ద్వారా సేకరించి న డబ్బులతో నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. అశోక్, తేజ, నగేష్, ఇంతియాజ్, సాయి పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

ములుగు రూరల్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేసి చర్య తీసుకువాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మెట్టువాడ తిరుపతి అన్నారు. ఈ మేరకు ఆదివారం అవినీతికి పాల్పడిన వారిపై డీఎస్పీ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఇప్పిస్తామని అమయాక దళితుల వద్ద నుంచి రూ.లక్షలు కాజేసి మోసం చేశారని అన్నారు. డబ్బులు ఇచ్చిన వారు తిరిగి అడగడంతో దళితబంధు సాధన సమితి పేరుతో నాటకాలు ఆడుతూ అమాయకులను మోసం చేస్తున్నారని అన్నారు. దళారుల నుంచి కాపాడి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు.